క్లుప్తంగా...

నేడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

మణికొండ: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట రోడ్డులో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో, మంచిరేవుల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కోకాపేటలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నామని, భక్తులు పూజలు, ఉట్టి కొట్టే కార్యక్రమం, ఉంజాల్ సేవల్లో పాల్గొనవచ్చని వారు వివరించారు. మంచిరేవుల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ, రాత్రి 7.30 గంటలకు స్వామి వారి ఊరేగింపు, ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

హిల్టన్ ట్రేడర్స్ కార్ఖానాపై దాడి

- ఏడుగురు బాలకార్మికులను రెస్క్యూ చేసిన అధికారులు



హిల్టన్ ట్రేడర్స్ కార్ఖానాలో బాల కార్మికుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: బాల కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న హిల్టన్ ట్రేడర్స్ కార్ఖానాపై అధికారులు దాడి చేశారు. ఏడుగురు పిల్లలను రెస్క్యూ చేసి హోమ్‌కు తరలించారు. బచ్‌పన్ బచావో ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, లేబర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ లైన్ సహకారంతో ఈ దాడి చేశారు. ఈ సందర్భంగా బచ్‌పన్ బచావో తెలంగాణ ఏపీఓ నరేష్ పోలేపాక మాట్లాడుతూ, గత నెల 28న హిల్టన్ ట్రేడర్స్ కార్ఖానాలో పని చేస్తున్న ముగ్గురు బాల కార్మికులు తప్పించుకొని నాంపల్లికి వెళ్లారన్నారు. అక్కడ వారిని రెస్క్యూ చేసి విచారించగా, హిల్టన్ ట్రేడర్స్ కార్ఖానాలో బీహార్‌కు చెందిన ఏడుగురు బాలకార్మికులు పని చేస్తున్నారని సమాచారం అందిందన్నారు. వీళ్లంతా బైక్ సీట్ కవర్లు, ట్యాంక్ కవర్లు తయారుచేసే పరిశ్రమలో పని చేస్తున్నారన్నారు. ఏడుగురు బాలకార్మికులను రెస్క్యూ షెల్టర్ హోమ్‌లకు తరలించామన్నారు. దాడిలో లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వాల్యానాయక్, స్మైల్ టీం జగదీష్, జయరాజ్, సత్యం, చైల్డ్ లైన్ స్టాఫ్ శ్యామ్‌సుందర్ తదితరులున్నారు.

బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలి



ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తున్న బొక్క బాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటరు లిస్టులో అవకతవకలు ఉన్నాయని, వాటిని వెంటనే సరి చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు బొక్క బాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో బూత్‌ల వారీగా 40–45 వేలదొంగ ఓట్లు ఉన్నాయన్నారు. వెరిఫికేషన్ చేసి దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 20,243 ఓట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా నమోదైన ఓట్లను ఈ నెల 19వ తేదీ కొత్త లిస్ట్ రానుందన్నారు. అది రాకముందే ఈ ప్రక్రియను సరి చేయాలన్నారు. కార్యక్రమంలో కె.నవీన్, బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.



ఎర్రకుంట ప్రధానరహదారిపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మురికి కూపంగా ప్రధాన రహదారి

- ఇటు చెత్తాచెదారం.. అటు ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఎగసి వస్తున్న దుర్గంధం
- ఎర్రకుంట రోడ్డుపై రాకపోకలకు జనం అవస్థలు

మైలార్‌దేవ్‌పల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మురికి కూపంగా మారాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ నుంచి శ్రీరామ్ కాలనీకి వెళ్లే ఎర్రకుంట ప్రధాన రహదారే ఇందుకు నిదర్శనం. ఈ రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోవడం పరిస్థితి అధ్వానంగా ఉంది.

- పక్కనే ఎర్రకుంట మురికి నీటితో నిండి ఉంది. ఇటు ప్లాస్టిక్ వ్యర్థాలు, అటు మురికి నీటి కారణంగా వస్తున్న దుర్వాసనతో ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు.
- అసలే ఇరుకు రోడ్డు, దీనికి తోడు పై నుంచి వస్తున్న వరద నీటితో రోడ్డుపై గుంత ఏర్పడింది. అందులో నీరు చేరి ప్లాస్టిక్ వ్యర్థాలు పైకి తేలుతున్నాయి. చిన్నారులు ఆ గుంతల్లో పడితే గల్లంతయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు ఉండటంతో పాదచారులు నడవలేని పరిస్థితి ఉందని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఎర్రకుంట ప్రధాన రహదారి జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోకి కొంత భాగం వస్తుందని, రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలపై వారికి ఫిర్యాదు చేస్తే మా పరిధిలో రాదు అనే సమాధానం ఇస్తున్నారని స్థానికులు చెప్తున్నారు.
- రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సర్కిల్ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇంత చెత్త పేరుకుపోతున్నదని, వారు ప్రతి రోజూ క్లీనింగ్ చేస్తే రోడ్లు శుభ్రంగా ఉంటాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఎవరి పరిధిలోకి వస్తుందో వారు వచ్చి శుభ్రం చేస్తే బాగుంటుందంటున్నారు.

వాహనాలను నడపాలంటే భయమేస్తోంది



ఎర్రకుంట ప్రధాన రహదారిపై వాహనాలను నడపాలంటే భయమేస్తోంది. రోడ్డు వెడల్పు తక్కువ గా ఉండటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పుడు రోడ్లపై ఉన్న వ్యర్థాలతో పరిస్థితి మరీ ఘోరంగా మారింది. రెండు మున్సిపాలిటీలకు వారధిగా ఉన్న రోడ్లపై చెత్తను తరలించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. ఫిర్యాదు చేస్తే తమ పరిధి కాదని అధికారులు చేతులు దులుపేసుకుంటున్నారు.

–పల్లాటి నర్సింహ, వాహనదారుడు

'ఎస్సీ వర్గీకరణ'ను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మణికొండ: ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఈనెల 18 నుంచి నిర్వహించే పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లును ప్రస్తావించి ఆమోదింపజేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌రావు మాదిగ, సురేష్‌మాదిగ, రత్నం మాదిగ, జగన్‌మాదిగ అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బుధవారం వారు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్తామన్న హామీని నెరవేర్చలేదన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో పలు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పెట్టబోతుందని, అందులో ఎస్సీ వర్గీకరణ బిల్లును చేర్చాలని పట్టు పట్టాలని కోరామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నరేందర్‌మాదిగ, యాదవరావు మాదిగ సందీప్, అరుణ్ కుమార్, దుర్గేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపు



బుద్వేల్‌లో వీధి కుక్కలను పట్టుకుంటున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రాజేంద్రనగర్: ప్రజలకు వీధి కుక్కల బెడద లేకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో వాటిని వేరే ప్రాంతానికి తరలిస్తున్నామని శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకుడు పెండ్యాల సాయిమాలిక్ వెల్లడించారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో వీధి కుక్కల కారణంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి వీధికుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బుధవారం బుద్వేల్, రాజేంద్రనగర్, భగవతిగూడ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకొని కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పెండ్యాల సాయిమాలిక్ మాట్లాడుతూ, కాలనీల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. కొంతమందిపై ఇప్పటికే దాడులకు పాల్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో సమావేశమై సమస్యను వివరించామన్నారు. వారు సానుకూలంగా స్పందించి కుక్కలు పట్టుకునేందుకు వ్యాన్, సిబ్బందిని పంపించారన్నారు.



1973 బ్యాచ్ విద్యార్థుల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాలలో బుధవారం సందడిగా జరిగింది. బీఎస్సీ అగ్రికల్చర్ 1973 బ్యాచ్ విద్యార్థులంతా 50 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వివిధ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ పొందిన వీరు తమ కళాశాల మిత్రులను చూసి ఎంతో ఆనందానికి గురయ్యారు. ఒకరి యోగ క్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులు ఎం. సుదర్శన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. యాభై ఏళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

ప్రజలకు తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించాలి



కొత్వాల్‌గూడలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును పరిశీలిస్తున్న జేడీ అశోక్‌సామ్రాట్

బండ్లగూడ: కొత్వాల్‌గూడలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ అశోక్‌సామ్రాట్ బుధవారం సందర్శించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్రతో కలిసి ఆయన అక్కడ జరుగుతున్న పనిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేడీ అశోక్‌సామ్రాట్ మాట్లాడుతూ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ పార్కును సందర్శించామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ రిక్షాల వారికి అందించాలే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పొడి చెత్తను వేరు చేయడం, తడి చెత్తను కంపోస్ట్ చేయడం వంటివి పరిశీలించారు. డంపింగ్ యార్డులో మొక్కలు పెంచాలని, అది కూడా చాలా పెద్ద మొత్తంలో పెంచి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



సత్యజిత్ (ఫైల్)

శంషాబాద్: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మన్యం తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం బాలాసోర్ ప్రాంతానికి చెందిన శ్యాంసుందర్ రావు కుమారుడు సత్యజిత్ (21) పట్టణంలోని రుద్రాకాలనీలో స్నేహితుడు రితిక్‌తో కలిసి అద్దె గదిలో ఉంటూ.. స్థానికంగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. తండ్రి శ్యాంసుందర్ బాలానగర్, సోదరుడు మరో ప్రాంతంలో ఉంటున్నారు. కుటుంబమంతా చిన్నా భిన్నంగా ఉందని ఆవేదన చెందుతున్న సత్యజిత్ మంగళవారం రాత్రి స్నేహితుడు తినడానికి బయటికి వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముంపు సమస్యను నివారిస్తాం

ఎస్‌ఎన్‌డీపీ చీఫ్ ఇంజినీర్



కాలనీలవాసుల అనుమానాలను నివృత్తి చేస్తున్న చీఫ్ ఇంజినీర్ కిషన్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, ప్రవేశ రోడ్డుపై ఏర్పడుతున్న ముంపు సమస్యను పూర్తి స్థాయిలో నివారించేందుకే బాక్స్ డ్రైన్ పనులను చేపడుతున్నామని ఎస్‌ఎన్‌డీపీ చీఫ్ ఇంజినీర్ కిషన్ అన్నారు. బుధవారం ఆయన శేరిలింగంపల్లి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ శ్రీనివాస్, డీఈ జ్యోతిలతో కలిసి మణికొండలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచవటి, పక్కనున్న జీహెచ్‌ఎంసీ పరిధిలోని లేఅవుట్ వాసులు రిటర్నింగ్ వాల్‌ను ఎత్తుగా నిర్మిస్తున్నారని, తమ రోడ్లలో పడిన వర్షం నీరు అందులోకి వెళ్లే అవకాశం లేక పోతే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. దాంతో వారు కాలనీల్లోని రోడ్ల ఎత్తు, రిటరినింగ్ వాల్ వచ్చే ఎత్తులను వారికి వివరించారు. అన్ని రోడ్లపై పడిన వర్షం నీరు అందులోకి పోవటంతో పాటు పైనుంచి వచ్చే వాగు నీరు సైతం కాలనీల్లోకి రాకుండా బాక్స్ డ్రైన్‌ను డిజైన్ చేశామన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే సంవత్సరం నుంచి ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మేనేజర్ రమేష్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

శేరిలింగంపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనన్నారు. కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత లేక అంగన్‌వాడీలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం



సుహాసినిని సన్మానిస్తున్న మల్లారెడ్డి తదితరులు

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన హైదర్‌గూడ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సుహాసినిని బుధవారం ఘనంగా సన్మానించారు. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో సుహాసినిని శాలువా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల బంగారు భవిష్యత్ బాటలు వేసేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో శ్రమిస్తారని, వారి సేవలు ఎనలేనివన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని హైదర్‌గూడ ప్రాథమిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నారని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయియాదవ్, కాకుశారం కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాలలో అడ్డుకున్నారని దళితుల ఫిర్యాదు

గచ్చిబౌలి: బోనాలలో దళితులను అడ్డుకోవడంతో తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఈ పంచాయితీ గచ్చిబౌలి ఠాణాకు చేరింది. వట్టినాగులపల్లిలో రెండు రోజులుగా బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం దళితులు బోనాలతో దేవాలయానికి వెళుతుండగా ఇతరులు తమను తిడుతూ దాడి చేశారని దళితులు బక్కని రాము, బ్యాగరి అభిలాష్, సాయి తదితరులు గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కుల వివక్షకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బోనాల విషయంలో తోపులాట చోటుచేసుకున్న మాట వాస్తవమేనని, పూర్తి వివరాలు సేకరించిన అనంతరం కేసు నమోదు చేస్తామని గచ్చిబౌలి సీఐ జేమ్స్‌బాబు తెలిపారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులకు అరుదైన అవకాశం

కేంద్ర సంస్థల డైరెక్టర్లుగా నియామకం



ప్రొ.బివిశర్మ



ప్రొ. అమితాబ్‌పాండే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులు కేంద్ర సంస్థ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ప్రొఫెసర్ బివి శర్మ, ప్రొఫెసర్ అమితాబ్‌పాండే హెచ్‌సీయూలోని ఆంత్రోపాలజీ విభాగం పూర్వ విద్యార్థులు. ఆంత్రోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్‌ఐ) హెచ్‌క్యూ డైరెక్టర్లుగా వీరు నియమితులయ్యారు. ప్రొఫెసర్ బివిశర్మ హెచ్‌సీయూలోని ఆంత్రోపాలజీ విభాగంలో 30 ఏళ్లకు పైగా బోధనా విభాగంలో ఉన్నారు. అలాగే ప్రొఫెసర్ అమితాబ్ పాండే భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్‌ఎం)లో సోషియాలజీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు చైర్మన్, ప్రొఫెసర్‌గానూ ఉన్నారు. పాండే ప్రపంచబ్యాంక్, యూఎన్‌డీపీ, యూనిసెఫ్, యూరోపియన్ యూని యన్, ఐసీఎస్‌ఎస్ఆర్, డీఎస్‌టీ, ఎంఓటీఏలతో కన్సల్టెంట్, ట్రైనర్‌గా జాతీయ, అంతర్జాతీయ బహుళ ప్రాజెక్టులను పూర్తి చేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శశాంక్, అత్తాపూర్

మణికొండ: నార్సింగి, మణికొండ, మున్సిపాలిటీల పరిధిలోని పలు పాఠశాలల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి ని ఘనంగా నిర్వహించారు. కొందరు చిన్నారులు శ్రీ కృష్ణుడు, రాధ, గోపికల వేషాధారణలో వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్లోకా ది స్కూల్, నారాయణ ఒలింపియాడ్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉత్తమ వేషాధారణ విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. నారాయణ ఒలింపియాడ్ స్కూల్ ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, ఆర్‌ఐ మాధవరెడ్డి, ఏడీ రేష్మ, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య, శ్లోక ది స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ భవానీతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. కృష్ణుడి వేషాధారణతో పాటు రాధిక, గోపికల వేషాధారణలో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.



సి. దిలీప్‌కుమార్, మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్



మణికొండ నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ..



శ్లోక ది స్కూల్‌లోకృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



బండ్లగూడ: సరస్వతీ విద్యాపీఠంలో...

రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- 1.33 ఎకరాల్లో నిర్మాణ పనులు
- ఇక వెజ్, నాన్‌వెజ్ అన్నీ ఒకే చోట లభ్యం



జరుగుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా కార్పొరేషన్ పరిధిలో కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పీరంచెరువు ప్రాంతంలోని సర్వే నంబర్ 33లో 1.33 ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ స్థలంలో మార్కెట్ నిర్మాణం పనులు చకచకా జరుగుతున్నాయి.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..

కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, బండ్లగూడజాగీర్, పీరం చెరువు, గంధం గూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం 32,732 నివాసగృహాలు ఉండగా 150 కాలనీలు ఏర్పడ్డాయి. జనాభా 1.50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. శరవేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే..

మొదట్లో స్థలం తక్కువగా ఉందని వద్దనుకున్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు ఈ స్థలం ప్రధాన జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం, కార్పొరేషన్ ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని పీరంచెరువు ప్రాంతంలోని సర్వే నంబర్ 33లో మార్కెట్ నిర్మిస్తున్నారు.

అన్ని విక్రయాలు ఒకేచోట..

ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తైతే కార్పొరేషన్‌లోని ప్రజలకు కూరగాయలు, మాంసం, చేపలు, పండ్లు, పూలు వంటివన్నీ ఇక్కడే లభిస్తాయి.వీటిని నిల్వ చేసేందుకు వేరువేరు గదులు నిర్మిస్తున్నారు. లోడింగ్,అన్‌లోడింగ్, ప్లాట్‌ఫాంలు, తాగునీరు, లైటింగ్, ఎలక్ట్రానిక్ తూకం పాయింట్లతో పాటు విశాలమైన పార్కింగ్ తదితర సదుపాయాలు ఉంటాయి.

మొత్తం 81 స్టాళ్లు...

ఇక్కడ మొత్తం 81 స్టాళ్లు నిర్మించనున్నారు. కూరగాయల విక్రయానికి 40 స్టాళ్లు, నాన్‌వెజ్‌కు 26 స్టాళ్లు, పండ్లు, పూలు వంటివి విక్రయానికి 15 స్టాళ్లు నిర్మిస్తున్నారు.

వీలైనంత త్వరగా అందుబాటులోకి...



తినే ఆహారం పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం చేపట్టింది. కార్పొరేషన్ ప్రజలకు అన్ని కూరగాయలతో పాటు మటన్, ఫిష్, తదితర విక్రయాలు ఒకేచోట లభించేలా అధునాతన హంగులతో మార్కెట్ నిర్మిస్తాం. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూస్తాం. వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

– బచ్చలకూరి శరత్‌చంద్ర, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230